సాక్షి
బాపట్ల
ఆదివారం । 19 । మే । 2024



కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని బోసు బొమ్మ సెంటర్ వద్ద ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

ఫిరంగిపురం: వేమవరంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవం శనివారం నిర్వహించారు. స్వామివారి ధ్వజాన్ని వాహనంపై ఊరేగించారు.

వాసవీ మాతకు విశేష పూజలు



ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతిని శనివారం విశేషంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.

న్యూస్‌రీల్

తెలంగాణ ఎంసెట్‌లో సోపిరాల విద్యార్థికి ర్యాంక్



చినగంజాం: తెలంగాణ రాష్ట్రంలో శనివారం విడుదలైన ఎంసెట్ ఫలితాల్లో చినగంజాం మండలం సోపిరాల గ్రామానికి చెందిన విద్యార్థి మంచి ర్యాంక్ సాధించాడు. గ్రామానికి చెందిన నరహరి శ్రీహరిరావు కుమారుడు రోహిత్ శివశంకర్ రాష్ట్రస్థాయిలో 181వ ర్యాంక్ సాధించాడు. గతంలో జేఈఈ మెయిన్స్‌లోనూ 176వ ర్యాంక్ పొందాడు. ఈ నెల 26న జరిగే జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించేందుకు కృషి చేస్తున్నాడు. భవిష్యత్‌లో సివిల్ సర్వీస్ సాధించాలనేది తన సంకల్పం అని తెలిపాడు. రోహిత్ ర్యాంక్ సాధించడంపై సోపిరాల గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, బంధువులు అతనికి అభినందనలు తెలియజేశారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ అభినందనీయం



బాపట్ల: జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం అభినందనీయమని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషాను శనివారం ఆయన చాంబర్‌లో రెడ్‌క్రాస్ ప్రతినిధులు సన్మానించారు. జిల్లా ప్రజలంతా ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా కలెక్టర్ కృషి చేశారని నారాయణభట్టు కొనియాడారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు సాధిక్ మాస్టర్, కళ్యాణలక్ష్మి పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల వద్ద కట్టుదిట్టమైన భద్రత

బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. శనివారం కళాశాలలో స్ట్రాంగ్ రూముల్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వెంట ఏఎస్పీ విఠలేశ్వర్, డీఆర్‌ఓ సత్తిబాబు ఉన్నారు.

సజావుగా ఏపీ ఈఏపీసెట్ ఇంజినీరింగ్ పరీక్షలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీ సెట్–2024)లో భాగంగా ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈనెల 23 వరకు జరగనున్న ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలకు గుంటూరు జిల్లాలో 20 వేల మంది విద్యార్థులు హాజరు కానుండగా, 15 ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా కంప్యూటర్ బేస్డ్ విధానంలో పూర్తిగా ఆన్‌లైన్‌లోనే పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్ర ఉన్నత విద్యామండలి విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

సాగర్ నీటి మట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 807.00 అడుగుల వద్ద ఉంది.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3500, గరిష్ట ధర రూ.5200, మోడల్ ధర రూ.4300 వరకు పలికింది.

పల్నాడు జిల్లా కలెక్టర్‌గా శ్రీకేశ్ బి.లఠ్కర్



ఉత్తర్వులు జారీచేసిన ఎన్నికల కమిషన్

నరసరావుపేట: పల్నాడు జిల్లా కలెక్టర్‌గా శ్రీకేశ్ బి.లఠ్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2011 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన లఠ్కర్ గతంలో ఏపీ ఆగ్రోస్ సంస్థకు, అగ్రికల్చర్ కోఆపరేషన్ డిపార్టుమెంట్ ఉపాధ్యక్షులుగా, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. 2018 మార్చి నుంచి 2019 సెప్టెంబరు వరకు గుంటూరు కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై పల్నాడు కలెక్టర్‌గా రానున్నారు. ఇక్కడ రెండేళ్లకుపైగా పనిచేసిన ఎల్.శివశంకర్‌ను ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక సంఘటనలకు బాధ్యుల్ని చేస్తూ కమిషన్ బదిలీ చేసి ఆయనపై విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే.

పల్నాడు జిల్లా ఎస్పీగా మలిక గర్గ్



ఉత్తర్వులు జారీచేసిన ఎన్నికల కమిషన్

నరసరావుపేట: పల్నాడు జిల్లా నూతన ఎస్పీగా మలిక గర్గ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల సంఘం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె గతంలో కృష్ణా జిల్లా అదనపు ఎస్పీగా, ప్రకాశం జిల్లా ఎస్పీగా రెండున్నరేళ్లకు పైగా పనిచేశారు. అనంతరం తిరుపతి ఎస్పీగా పనిచేశారు. మలిక గర్గ్ పశ్చిమ బెంగాల్‌కు చెందిన పోలీసు అధికారి. ఈమె రెండున్నరేళ్ల కిందట ఏర్పడిన పల్నాడు జిల్లాకు తొలి మహిళా ఎస్పీ కానున్నారు. ఎన్నికల సమయంలో నియమించబడి ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన జి.బిందుమాధవ్ ఎన్నికల రోజు, అనంతరం జరిగిన హింసాత్మక సంఘటనలకు బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేసిన విషయం విదితమే. మలిక భర్త వకుల్ జిందాల్ బాపట్ల జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు. ఆమె త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

సైకిల్ ఫ్యాక్షన్

- పల్నాడులో ఆగని టీడీపీ అరాచకాలు
- పచ్చనేతలకు పోలీసుల వత్తాసు
- వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడుల పర్వం
- తిరిగి ఆ పార్టీ కార్యకర్తలపైనే అక్రమ కేసులు
- ఇంటికి వెళ్లాలంటే భయమేస్తుంది అంటున్న ఫ్యాన్ పార్టీ కార్యకర్తలు
- అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ఊళ్లోకొస్తే చంపుతామంటున్నారు



మాచర్ల నియోజకవర్గం కారెంపూడిలో దాడులు చేస్తున్న టీడీపీ అల్లరి మూకలు (ఫైల్)

సాక్షి ప్రతినిధిగుంటూరు/పట్నంబజారు: ఊళ్లోకొస్తే చంపేస్తాం.. వైఎస్సార్ సీపీకి మద్దతుగా వ్యవహరిస్తారా .. ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు.. కచ్చితంగా మట్టుబెడతామంటూ తెలుగుదేశం పార్టీ నేతలు మరోమారు ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరతీశారు. పల్నాడు జిల్లాలో ఎన్నికల సాక్షిగా ప్రారంభమైన టీడీపీ నేతల దౌర్జన్యాలు ఇంకా సాగుతూనే ఉన్నాయి. అయినా పోలీసు అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంతోపాటు, వైఎస్సార్ సీపీ బాధితులపైనే తిరిగి కేసులు పెడుతున్నారంటూ ఆందోళన వ్యక్తమవుతోంది. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం కొత్తగణేశునిపాడులో పచ్చ మూకలు వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డాయి. ఎన్నికల వేళ వైఎస్సార్ సీపీకి ఓటు వేశారనే కోపంతో వారిని మట్టుపెడతామంటూ ఇళ్లపైకి దండెత్తాయి. ఆటోలు, బైక్‌లు, 50కి పైగా ట్రాక్టర్లను ధ్వంసం చేశాయి. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను దొరికినవారిని దొరికినట్లు టీడీపీ మూకలు చితక్కొట్టాయి. చాలా మంది వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు తీవ్ర గాయాలపాలై ప్రాణభయంతో ఊరు విడిచి పొలాల్లో తలదాచుకున్నారు. వీరికి రక్షణ కల్పించాల్సిన పోలీసులు తిరిగి బాధితులపైనే కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఊళ్లొకొస్తే చంపుతామంటూ టీడీపీ నేతలు బాధిత కుటుంబాల్ని భయపెడుతున్నారు.

సిట్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

ఎన్నికల వేళ టీడీపీకి వత్తాసు పలికిన అధికారుల్ని బదిలీ చేడయంతోపాటు, ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన సిట్ నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజల్ని ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పల్నాడు ప్రాంత వాసులు కోరుతున్నారు. ప్రజాస్వామ్యంలో దాడులు హేయమైన చర్య అని, వాటిని ప్రోత్సహించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే పల్నాడులో కొంతమంది పోలీసు అధికారుల వల్లే హింసాత్మక వాతావరణం నెలకొందని భావిస్తున్నారు.



మాచవరం మండలం కొత్తగణేశునిపాడు గ్రామంలో టీడీపీ వర్గీయులు ధ్వంసం చేసిన బైకులు(ఫైల్)

కన్నాపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదు

పోలింగ్ సమయంలో సత్తెనపల్లి నియోజకవర్గంలో అక్కడి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తన మార్క్ రౌడీయిజాన్ని చూపించారు. నియోజకవర్గంలోని చాగంటివారిపాలెంలో ఎన్నికల రోజు పోలీసుల్ని అడ్డుపెట్టుకుని తన అనుచరులతో గూండాగిరి చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రూరల్ సీఐ రాంబాబు ఇష్టానుసారం లాఠీచార్జి చేయడంతోపాటు, కర్కశంగా వ్యవహరించారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాంచారయ్య అనే కానిస్టేబుల్ మహిళలని కూడా చూడకుండా దాడి చేశాడని, వైఎస్సార్ సీపీ కుటుంబాల్ని లక్ష్యంగా చేసుకుని హింసకు తెగబడ్డారని చెబుతున్నారు. బ్రహ్మారెడ్డి అనే వ్యక్తి అడ్డుకోబోతే కన్నా వర్గీయులు అతడిపై దాడి చేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఫిర్యాదు తీసుకోబోమని నేరుగా చెబుతున్నారంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల రోజున దమ్మాలపాడులో రిగ్గింగ్ జరుగుతుందని, తొండపిలో దౌర్జన్యం చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందించేందుకు సీఐ రాంబాబుకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా, కనీసం తిరిగి సమాధానం చెప్పిన పాపాన పోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఖాకీ వేసుకున్న టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరించారని మండిపడుతున్నారు. సీఐ రాంబాబు, ముప్పాళ్ల మండలంలో వైఎస్సార్‌సీపీకి ఓట్లు పడకుండా అడ్డుకోవడంతోపాటు, కన్నాకు తొత్తుగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం

- లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు
- నలుగురికి తీవ్ర గాయాలు ముగ్గురి పరిస్థితి విషమం
- బాధితులంతా బాపట్ల జిల్లా వాసులు



లారీని ఢీకొన్న కారు

కొడవలూరు: మండలంలోని టపాతోపు వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జాతీయ రహదారిపై లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలేనికి చెందిన ఎనిమిది మంది కారులో బ్రహ్మంగారి మఠం, ఒంటిమిట్ట రామాలయాల్ని దర్శించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. టపాతోపు క్రాస్‌రోడ్డు వద్ద ముందు వెళుతున్న లారీ హఠాత్తుగా స్లో చేయడంతో వెనుక వస్తున్న కారు వేగం అదుపు కాక వెనుక భాగాన ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న అట్ల ఏడుకొండలరెడ్డి, గుడివాడ దుర్గారావు, అన్నం కోదండరామిరెడ్డి, అసోది మల్లారెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. మల్లారెడ్డి పరిస్థితి కాస్త మెరుగ్గా ఉండగా, మిగిలిన ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటిలేటర్‌పై అత్యవసర చికిత్స అందిస్తున్నారు. కారులో ఉన్న మరో నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. వీరంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతోపాటు ప్రత్యేక కారులో దైవ దర్శనానికి బయలు దేరినట్లు బాధితులు తెలిపారు.

మానవత్వం చాటుకొన్న వైద్య విద్యార్థినులు

ప్రమాదం జరిగిన సమయంలో జాతీయ రహదారిపై కారులో వెళుతున్న వైద్య విద్యార్థినులు కొందరు తమ వాహనాన్ని ఆపి బాధితులకు ప్రాథమిక చికిత్స చేసి మానవత్వం చాటుకొన్నారు. సంఘటనా స్థలికి చేరుకొని కారులో ఉన్న ప్రమాద బాధితుల్ని స్థానికుల సాయంతో వెలికి తీయడంతోపాటు వారందరికీ ప్రథమ చికిత్స అందించారు. 108 వాహనానికి సమాచారం ఇచ్చి వారందర్నీ అందులోకి తరలించడంలో ఎంతో చొరవ చూపారు. వైద్య విద్యార్థినుల చొరవను అందరూ ప్రశంసించారు. ఎస్‌ఐ కె.వీరప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాలతో మెరిసిన బండ్లమ్మ



బంగారు ఆభరణాలతో బండ్లమ్మ అమ్మవారు

చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులో శ్రీ బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి కొలుపుల్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 2002లో అమ్మవారి ముఖ మండప నిర్మాణ సమయంలో లభ్యమైన ప్రాచీన బంగారు ఆభరణాల్ని చందోలు ఎస్‌బీఐ లాకరు నుంచి అధికారుల సమక్షంలో కనక తప్పెట్లు, బ్యాండు మేళాల నడుమ శోభాయాత్రగా తీసుకు వచ్చి అలంకరించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో దేవాలయం కిక్కిరిసింది. ఉదయాన్నే పసుపుకుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల నరసింహమూర్తి, ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు, తహసీల్దార్ స్వూర్తి, చందోలు ఎస్‌ఐ టి.అనిల్‌కుమార్, రెవెన్యూ, పంచాయతీ శాఖ అధికారులు, బ్యాంక్ నుంచి ప్రాచీన బంగారు ఆభరణాల్ని భద్రత చర్యల నడుమ దేవాలయానికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో చందోలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక బందోబస్తు


చందోలు ఎస్‌ఐ టి.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు చర్యలు తీసుకున్నారు. దేవాలయం ఆవరణలో భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో బారికేడ్లు ఏర్పాటు చేసి మంచినీరు, మజ్జిగ, ప్రసాద వితరణ చేశారు. అమ్మవారి తిరునాళ్ల ముగింపు సందర్భంగా ఆదివారం మొక్కుబడులు తీర్చుకోవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తెలిపారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

23న బుద్ధపూర్ణిమ వేడుకలు

తాడేపల్లి రూరల్ : మంగళగిరిలో 2,568వ బుద్ధ పూర్ణిమ వేడుకల్ని ఈనెల 23న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరిలో 25ఏళ్లుగా వేడుకల్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆ రోజు గౌతమ బుద్ధ రోడ్డులోని వైష్ణవి కల్యాణ మండపంలో సాయంత్రం 6 గంటలకు రేకా కృష్ణార్జునరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నామని వివరించారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- ఈనెల 24 నుంచి పరీక్షల నిర్వహణ
- జిల్లాలో పరీక్షలు రాస్తున్న 7384 మంది విద్యార్థులు



పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

బాపట్ల టౌన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఫలితాల వెల్లడి రోజునే షెడ్యూల్ విడుదల చేసింది. జిల్లాలో 10 పరీక్ష కేంద్రాల్లో పరీక్షల్ని నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బాపట్లలో మున్సిపల్ హైస్కూల్, లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్, గుళ్లపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్, రేపల్లె మండలం, పేటేరులోని ఎస్‌పీబీఎం జిల్లా పరిషత్ హైస్కూల్, కొల్లూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్, కొల్లూరులోని బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్, అద్దంకి మండలం, కాకానిపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, పేరాలలోని ఏఆర్ మున్సిపల్ హైస్కూల్, కొత్తపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్, మార్టూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు.

కట్టుదిట్టంగా నిర్వహించాలి

ఇంటర్, పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్ని కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) సీహెచ్. సత్తిబాబు సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. తన చాంబర్‌లో శనివారం పరీక్షల సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు

పరీక్ష కేంద్రాల్లో ఫర్నీచర్, తాగునీరు, ఫ్యాన్లు తదితర సదుపాయాలు ఉండే విధంగా చర్యలు తీసుకున్నాం. సీఎస్, డీవోలకు అవసరమైన ఆదేశాలిచ్చాం. పరీక్ష పేపర్లను పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచాం. సీఎస్, డీవో, ఇన్విజిలేటర్ల నియామకం పూర్తి చేశాం. రెగ్యులర్ పరీక్షలు మాదిరిగానే సప్లిమెంటరీ పరీక్షల్ని పకడ్బందీగా నిర్వహించనున్నాం.

– కె. నారాయణరావు, డీఈవో

ఎన్‌సీసీతో విద్యార్థులకు ఉన్నత భవిత



ఎన్‌సీసీ క్యాడెట్లతో కల్నల్ చంద్రశేఖర్, సిబ్బంది

గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ చంద్రశేఖర్

చీరాల టౌన్: ఎన్‌సీసీ విద్యార్థుల భవితకు అద్భుతంగా దోహదపడుతుందని గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం. చంద్రశేఖర్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా శనివారం 23వ ఆంధ్ర బెటాలియన్‌ను సందర్శించారు. ముందుగా క్యాడెట్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ఆంధ్ర బెటాలియన్‌లో శిక్షణ కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. విద్యార్థులకు భవిష్యత్‌లో ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం బెటాలియన్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిబ్బందితో మాట్లాడారు. బెటాలియన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, శిక్షణ కార్యక్రమాల గురించి కల్నల్ సునీల్ గౌతమ్ ఆయన వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన తేనేటి విందులో బెటాలియన్ పరిధిలోని ఎన్‌సీసీ అధికారులు, ఆర్మీ సిబ్బంది, క్యాడెట్స్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



కర్లపాలెం: శతాధిక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శనివారం కర్లపాలెంలో జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రం కర్లపాలెంకు చెందిన ఉప్పాల పేరయ్య భార్య సరస్వతి(105) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందారు. ఆమెకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

క్లుప్తంగా

దాచేపల్లిలో పోలీస్ కవాతు

దాచేపల్లి: గ్రామాల్లో ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని సీఐ ఎ.సురేంద్రబాబు తెలిపారు. ప్రత్యేక పోలీస్ బలగాలతో శనివారం నారాయణపురం, దాచేపల్లిలో కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసులకు ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి పాల్గొన్నారు.

ఉప్పలపాడులో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

వినుకొండ(నూజెండ్ల): జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నూజెండ్ల మండలం ఉప్పలపాడులో రూరల్ సీఐ సుధాకర్‌బాబు, ఐనవోలు ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా తనిఖీలు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీల్లో భాగంగా మండలంలోని అల్లర్లు జరిగే గ్రామాల్లో కూడా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. నూజెండ్ల, రెడ్డికొత్తూరు గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

కారెంపూడి విధ్వంసకాండ కేసుల్లో 20 మంది అరెస్టు

కారెంపూడి: అల్లర్లు, ఆస్తుల విధ్వంసకాండకు సంబంధించిన కేసుల్లో 20 మందిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పర్చినట్లు కారెంపూడి సీఐ నారాయణస్వామి శనివారం విలేకర్లకు తెలిపారు. కారెంపూడిలో టీడీపీ కార్యాలయంపై దాడి, జెడ్పీ హైస్కూలు వద్ద కారు దహనం తదితర దాడుల ఘటనలకు పాల్పడిన కేసులో వైఎస్సార్‌సీపీకి చెందిన 10 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, సానుభూతిపరుల ఇళ్లపై దాడులకు పాల్పడి పలు బైక్‌లను దహనం చేసిన చేసిన కేసులో టీడీపీకి చెందిన 10 మందిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. వారందరిపై నాన్ బెయిల్‌బుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి గురజాల కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ నారాయణస్వామి వివరించారు.

జై వాసవీ.. జైజై వాసవీ!



ఊంజల సేవ చేస్తున్న భక్తులు



రేపల్లెలో ప్రత్యేక పూజలందుకుంటున్న అమ్మవారు

- ఘనంగా వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవం
- పూజల్లో అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు

రేపల్లె రూరల్: వాసవీ కన్యకా పరమేశ్వరి జయంత్యుత్సవంలో భాగంగా రేపల్లె పట్టణం ఓల్డ్ టౌన్‌లోని అమ్మవారి ఆలయంలో శనివారం వేడుకల్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకవజామునే అమ్మవారికి సుప్రభాత సేవలతో మేళతాళాలు, వేద మంత్రాల నడుమ పండ్ల రసాలు, పంచామృతాలతో ఆలయ అర్చకులు అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్రాలు, పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వాసవీ కన్యకా పరమేశ్వరి జీవిత చరిత్రను వివరించారు. ప్రాణం కంటే మానం ఎంతో గొప్పదని తెలియజేసే అమ్మవారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని మహిళలు ఆమె బాటలో పయనించాలని చెప్పారు. ఆలయ ఆవరణలో జరిగిన పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, పువ్వులు, గాజులు, నూతన వస్త్రాలు, పండ్లు, మిఠాయిలతో కూడిన సారెను బహూకరించారు. శ్రీ లలితా సహస్ర నామపారాయణం, కనకధారా స్తోత్రంలతో పాటు వాసవీ భక్తి గీతాలు, భజనల్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం అమ్మవారిని ఊయలలో శయనింపచేసి ఊంజల సేవ చేశారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

వైభవంగా రథోత్సవం

భట్టిప్రోలు: శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాలలో భాగంగా భట్టిప్రోలులో అమ్మవారి దివ్య రథోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతులు శివస్వామీజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రథోత్సవ వాస్తు హోమం, బలిహరణ, కూష్మాండ బలి, కుంభ బలి, అనంతరం రథోత్సవం కొనసాగింది. పూజల్లో కె. వెంకట నాగరాజన్-లక్ష్మీరేఖ, ఎం. సాంబశివరావు-లక్ష్మీసుజాత, సీహెచ్.వి.ఉమామహేశ్వరరావు-ధనలక్ష్మి, బూర్లె సుబ్బారావు-సుజాత, కె రవికుమార్-నాగసైదేశ్వరి, ఎ. సురేంద్ర-ఉషారాణి దంపతులు పాల్గొన్నారు. ఉదయం అమ్మవారి రథ నిర్మాణ దాతల గోత్ర నామాలతో పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలతో పుష్పయాగం,సామూహిక కుంకమార్చన పూజలు జరిగాయి. పూజా సామగ్రిని ఆత్మూరి సతీష్ కుమార్-విజయలక్ష్మి దంపతులు అందజేశారు. రథోత్సవంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి దివ్య రథోత్సవం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భాజా భజంత్రీలు, పురందాస భజనలు, కోలాటాలతో వైభవంగా కొనసాగింది. రాత్రి అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాల్ని దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న బియ్యపు గింజల చిత్రం

ఆలయంలో భక్తులు బియ్యపు గింజలతో అమ్మవారి చిత్రపటాన్ని రూపుదిద్దారు. గోత్ర నామాలతో తయారు చేయబడిన ఈ చిత్రపటం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పటం వద్ద అమ్మవారిని నెలకొల్పి భక్తులు దీపారాధనలు చేశారు.



భట్టిప్రోలులో నిర్వహించిన పూజల్లో దంపతులు

'అమ్మతో సంభాషణలు' గ్రంథావిష్కరణ



గ్రంథావిష్కరణ చేస్తున్న హైకోర్టు జడ్జి దుర్గాప్రసాద్

బాపట్ల: మండలంలోని జిల్లేళ్లమూడిలో ఉన్న అమ్మ పుణ్యక్షేత్రాన్ని శనివారం హైకోర్టు జడ్జి జస్టిస్ యు. దుర్గాప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అక్కడే ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో తొమ్మిది మంది ఘనాపాటీలతో జరిగిన కృష్ణ యజుర్వేద నమకః ఘన పారాయణాన్ని తిలకించారు. అనంతరం జరిగిన సభలో న్యాయమూర్తి దంపతుల్ని వేద పండితుల ఆశీర్వదించారు. జిల్లేళ్లమూడి అమ్మతో సంభాషణలు గ్రంథాన్ని న్యాయమూర్తి దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లేళ్లమూడి అమ్మ పుణ్యక్షేత్రానికి రావడం ఎంతో సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. అమ్మ సిద్ధాంతాలు సర్వదా ఆచరణీయమని తెలిపారు. పదిమందికి అన్నం పెట్టడమే నిజమైన సేవ అని అన్నారు. విశ్వజనని పరిషత్ ట్రస్ట్ నిర్వాహకులు న్యాయమూర్తుల దంపతుల్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వారణాసి ధర్మసూరి, బ్రహ్మాండం రవీంద్రరావు, విశ్వజనని పరిషత్ సభ్యులు చక్కా శ్రీమన్నారాయణతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పలువురు అమ్మ భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు.

ఎన్నికల ఘర్షణలో 10 కేసులు నమోదు

దాచేపల్లి: సాధారణ ఎన్నికల సమయంలో, ముగిసిన తరువాత జరిగిన ఘర్షణలో 10 కేసులు నమోదు చేసినట్లు సీఐ ఎ.సురేంద్రబాబు శనివారం తెలిపారు. మండలంలోని కేసానుపల్లిలో జరిగిన ఘర్షణలో 21మందిపై, మాదినపాడు జరిగిన ఘర్షణలో 37మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తంగెడ, ఇరికేపల్లిల్లో జరిగిన ఘర్షణలో 61మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసుల్లో కొంతమందిని అరెస్ట్ చేయగా మరికొంతమంది పరారీలో ఉన్నట్లు సీఐ చెప్పారు.

కుక్కను హతమార్చిన వ్యక్తి అరెస్టు

గుంటూరు రూరల్: చికెన్‌షాపులోకి వచ్చి కోళ్లను తింటుందనే కోపంతో వీధి కుక్కపై కత్తితో దాడిచేసి దానిని చంపిన వ్యక్తిని నల్లపాడు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. గోరంట్ల ఇన్నర్ రింగ్‌రోడ్డులోని సితార చికెన్ సెంటర్‌లో గోపీకృష్ణ పనిచేస్తున్నాడు. రోజూ ఓ వీధికుక్క చికెన్ సెంటర్‌లోకి వచ్చి కోళ్లను తింటోంది. శుక్రవారం అర్ధరాత్రి కూడా చికెన్ స్టాల్‌లోకి రావడంతో గోపీకృష్ణ దానిపైకి కర్ర విసిరాడు. కుక్క అతడిపై దాడి చేసేందుకు యత్నించడంతో తన వద్ద ఉన్న కత్తితో దాన్ని చంపేశాడు. ఈ విషయాన్ని అదేసమయంలో అటుగా వెళుతున్న బ్లూక్రాస్ సభ్యులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటన స్థలికి చేరుకుని నిందితుడిని, కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

గుంటూరు రూరల్: ఎన్నికల సమయంలో మద్యం అక్రమంగా విక్రయిస్తూ పోలీసులకు దొరకకుండా పరారైన వ్యక్తిని శనివారం అరెస్ట్ చేశారు. ఈనెల 6న మండలంలోని జొన్నగడ్డలో తుల్లిమిల్లి సురేష్ అనే వ్యక్తి ఓటర్లను ప్రలోభ పెట్టి మద్యం పంచుతున్నాడని సమాచారం రావడంతో ఎక్సైజ్ సిబ్బంది దాడి చేశారు. సురేష్ దాచి ఉంచిన 94 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. అతడ్ని శనివారం అరెస్టు చేసి ఎక్సైజ్ కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు రిమాండ్ విధించింది.

బైకు కాలువలో పడి వృద్ధుడి మృతి



కాల్వలో పడిన బైక్, పక్కన లక్ష్మయ్య



లక్ష్మయ్య (ఫైల్)

బల్లికురవ: బైకు అదుపు తప్పి కాలువలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద శనివారం జరిగింది. మండలంలోని కొణిదెన గ్రామానికి చెందిన తన్నీరు లక్ష్మయ్య (63) ఏటా బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో ఆయన గురువారం రాత్రి బైకుపై అద్దంకి వెళ్లి అక్కడి నుంచి బస్సు ఎక్కి మఠం వెళ్లాడు. అక్కడ పూజల్లో పాల్గొని తిరిగి శుక్రవారం రాత్రి బయలుదేరి శనివారం ఉదయానికి అద్దంకి చేరుకున్నాడు. అక్కడున్న తన బైకును తీసుకుని గ్రామానికి వెళ్తుండగా ధర్మవరం, వల్లాపల్లి గ్రామాల మధ్యనున్న అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద అదుపు తప్పి 20 అడుగుల లోతులో ఉన్న కాలువలో పడింది. దాంతో లక్ష్మయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వల్లాపల్లి గ్రామస్తులు గమనించి 108 వాహనం వచ్చేలోపు వైద్యం అందాలనే ఉద్దేశంతో సొంత కారులో గుంటుపల్లి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యాధికారి మమత ప్రాథమిక చికిత్స చేసి, ఆక్సిజన్ ఏర్పాటు చేసి ఉన్నత చికిత్స కోసం మార్టూరు సీహెచ్‌సీకి తరలించే క్రమంలో లక్ష్మయ్య మృతి చెందాడు. ఆయనకు భార్య రామకోటమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే లక్ష్మయ్య ప్రమాదవశాత్తు మృతిచెందంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామ సర్పంచ్ లేపాక్షి విష్ణు, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి స్థానిక నాయకులు గుంజి ఆంజనేయులు, షేక్ జానువలి, లక్ష్మయ్య కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.

భార్యా, పిల్లలను చూడటానికి వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వెంకయ్య (ఫైల్)

మార్టూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. జే. పంగులూరు మండలం బైటమంజులూరు గ్రామానికి చెందిన తాళ్లూరి వెంకయ్య (28) మార్టూరు మండలం రాజుపాలెం ప్రబోధ్ నగర్ ఎస్సీ కాలనీలో అత్తగారింట్లో ఉన్న భార్యా, పిల్లలను చూడడం కోసం శుక్రవారం రాత్రి బైకుపై బయలుదేరాడు. మరో 10 నిమిషాల్లో అక్కడకు చేరుకోవాల్సిన వెంకయ్య బైకును రాజుపాలెం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యులు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లాల్సిందిగా సూచించారు. అక్కడకకు తరలిస్తుండగా పరిస్థితి విషమించి రాజుపాలెం సమీపంలోనే మృతి చెందడంతో తిరిగి మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకయ్య మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు వెంకయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మృతి చెందిన యువతి ఆచూకీ లభ్యం

- ఓటు హక్కు కోసం స్వగ్రామం ఉన్నవకు వచ్చి మృతి
- ఆస్పత్రి చెకప్‌కంటూ బైక్‌పై తీసుకెళ్లిన భర్త మాయం
- భార్య నీలం పెర్సీ మూడు రోజులు తర్వాత శవంగా దర్శనం

యద్దపాడు: ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన యువతి విగతజీవిగా మారింది. అనుమానాస్పదంగా హైవే పక్కన పొలం గట్ల వద్ద శవంగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు భిన్నకోణాల్లో విచారణను కొనసాగించారు. యువతి బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం పేర్లిపాడు వాసిగా గుర్తించారు. ఆమె స్వగ్రామం యద్లపాడు మండలం ఉన్నవ గ్రామం సూర్యనగర్ కాలనీకి చెందినట్లు తమ దర్యాప్తులో కనుగొన్నారు. ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...యద్లపాడు మండలం తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని జీపీ ఆయిల్ మిల్లు సమీపంలో ఈనెల 15న యువతి మృతదేహం ఉన్నట్లు సమాచారం వచ్చింది. రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ శామ్యూల్ రాజీవ్‌కుమార్ సిబ్బందితో వెళ్లి విచారణ చేపట్టారు. మండలంలోని ఉన్నవ గ్రామానికి చెందిన సుబ్బారావు, అన్నామణి దంపతుల కుమార్తె నీలం పెర్సీ(18). మూడేళ్ల కిందట బాపట్ల జిల్లాకు చెందిన వసంతకుమార్‌తో వివాహం అయింది. ప్రస్తుతం నీలం పెర్సీ నాలుగు నెలల గర్భిణి. ఈనెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలకు పెర్సీ పుట్టింటికి వచ్చి తల్లిదండ్రులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకుంది. సాయంత్రం భర్త వసంతకుమార్ ఉన్నవకు వచ్చి భార్యను ఆస్పత్రిలో చెకప్ చేయిస్తానంటూ బైక్‌పై ఎక్కించుకుని వెళ్లాడు. సాయంత్రం ఆరు గంటలకు వెళ్లిన వారిద్దరిలో పెర్సీ మూడు రోజుల తర్వాత శవమై కన్పించగా, భర్త ఆచూకీ నేటికీ లభించలేదు. పెర్సీ కుటుంబ సభ్యులు భర్తపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పెర్సీది హత్యా..ఆత్మాహత్య ? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.